కవితా కౌముది

# రిపోర్టింగ్

రవి కిషోర్ పెంట్రాల

వేకువజాము సూరీడి
సిందూరపు కలర్
కంటికి ఆట్టె ఆనట్లేదని
ఓటర్లు ఒకటే కంప్లయింట్స్!

ఓస్ అదెంతపనీ
నాలుగు పవర్ఫుల్ డ్రోన్లెట్టి
ఎర్రెర్రగా డేరాజకు పిచకారీ చేద్దామని
మన లీడర్ల వాగ్దానాలు!

ఆప్యాయతలు అనుబంధాలని
మూవీలో ముతకమాటలు పెట్టారనీ
యాక్టర్లు బుద్ధిలేక ఆ డైలాగ్స్ చెప్పారని
మండిపడుతున్న ఆడియన్స్!

కిక్కెక్కించే బ్లడ్ బాత్స్
హైపెక్కించే బిహెడింగ్స్ లింబ్స్ కట్స్
క్రైపెక్కించే అబ్సర్డ్ సీన్స్ లేవనీ
అసెంబ్లీముందు ఆమరణదీక్షలో
సినీలవర్స్!

రాబోయే సినిమాల్లో
మీ కోరికల్లో ఏ ఒక్కటి తగ్గినా
సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా
జీవో ఇస్తామన్న హామీతో దీక్ష విరమణ!

ఏజోల్డ్ ఇంటిగుట్టుల స్టోరీస్
సిల్వర్ స్క్రీన్ మీద బోరంటూ
నేటితరం న్యూమూవీ గోవర్స్
లైవ్లోనే చూపిస్తున్న నేటి పొలిటీషియన్స్!

సినిమా ఓటీటీ స్క్రీన్స్ లాంగ్వేజ్ కి
సభ్యసమాజ భాష సరితూగట్లేదనీ
అంతరాలు తగ్గించాలనీ జనాల డిమాండ్
అల్లాగే మానుండే మొదలని నాయకులు!

చెడుకాలపు జిల్లా
పిచ్చిపల్లె పురం
ఉన్మాదపు వీధినుండి
కెమెరామెన్ షాకింగుతో రిపోర్టర్
బ్రేకింగుడు!

★★★

# చుక్కెదురు

డా.మూర్తి జొన్నలగెడ్డ

అయిదేళ్ళకోసారి
ఆట విడుపుకు
వేటకొస్తే
దారి తోచని
వెర్రి గొర్రెలు
(త్రి)నేతలకు
ఎటు చూసినా లక్కెదురే!

ప్రజాస్వామ్యంలో
రాచరికం
ప్రజా రాజ్యంలో
అరాచకం
ముందు నుయ్యి
వెనుక గొయ్యి
ఎటు చూసినా బొక్కెదురే!

రాబందును పట్టి కొట్టి
గుంటనక్కకు కట్టి పెట్టి
పెనం మీంచి
పొయ్యి లోకి
దూకుడంటే
ఎటు చూసినా చిక్కెదురే!

వోటేసేందుకు
గొంతులోకి చుక్క
వోటేసినందుకు
వేలు మీదకి చుక్క
ప్రజా స్వామ్యంలో
వోటరుకి
ఎటు చూసినా చుక్కెదురే!

★★★

# సౌజాత్యనై వీక్షించాలనివుంది! సుజాత.పి.వి.ఎల్

అగాధాల లోపల
ఆశల ఆలోచనలే ఉండవుట!..
దిగంతాల ఆవల
దుఃఖానికి చోటే లేదుట!..
అసలు అలాంటి లోకం ఒకటుందా!?
ఏమో!..ఉందేమో అనిపిస్తోంది..
ఇదిగో ఇలా స్వేచ్ఛగా విహరిస్తూ
నిశి వీడిన వెన్నెల లోకానికి
ఒక్కసారి వెళ్ళొస్తే బావుండుననిపిస్తోంది..
నీ కోసం నిరీక్షించి..నిరీక్షించి
ఇక రావని తెలిసి
కన్నీరు కారుస్తూ..
సమయాన్ని వృధా చేసుకునే బదులు..
నీతో నడవలేక,
అడుగు అడుగు ఓడిపోతూ..
దినదిన గండంలా
విరాగినై బతికే బదులు..
ఆత్మస్థైర్యం నిండిన
వియతినిలా
ఒక్కసారి వెళ్ళొస్తే తప్పేముంది!?

అమావాస్యలైన కనుల కడసారి వేడుక
తీర్చేందుకు..
మనసు పూర్తి చీకటి రాత్రిగా
మారిపోకముందే..
అద్భుత జగమైన నక్షత్రనేమి సదనానికి
ఒక్కసారి వెళ్ళి దర్శిస్తే చాలనిపిస్తోంది.!
మానసికోల్లాసాభినంద
పరవశంతో..మదిముదావహమై
విహరిస్తుంటే.. సౌజాత్యనై
వీక్షించాలనివుంది.!!

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఎంత సుందరతరమైనదీ దినమ్ము
దినకరుని మోము తూరుపు దిక్కునందు
వింత వర్ణముల ప్రభాతవేళ వెలిగె
నింపె భువినెల్ల మెరుగు వన్నియల తోడ

లెక్క లేనన్ని మేఘ మాలికలవెన్నొ
గగనసీమకు తామలంకారమయ్యె
ఇలకు తొడవులు తొడగెను వృక్షతతులు
జిలుగు వన్నెలనద్దినవలరులెన్నొ

పూల పరిమళములు నిండె పుడమి యెల్ల
పులుగు రావముల్ నిండెను భూతలమున
అనుపమానందదాయియౌ యవని శోభ
పొందనేరని మది పరిపూర్ణతేమి?

ఇంత యరుదైన కాన్క పట్టించుకొనక
పరుగులెత్తుట మనలకు భావ్యమౌనె!
చింతలను వీడి నిముసమ్ము సేద దీర
ప్రకృతి యొడినింత విశ్రాంతి బడయలేమె!

ఎవరు కారణమీ దివ్యసృష్టికెల్ల
ఏ మహత్తర శక్తియో హేతువేమొ!
ఎట్టులో లభ్యమైన యదృష్టమిద్ది
ప్రకృతి నిర్మాతకర్పింపవలయు ప్రణతి

COMMENTS